
ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హబక్ లాయిడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జెస్పర్ కాన్‌స్ట్రప్

రాష్ట్రంలో హబక్ లాయిడ్ పరిశ్రమలు

రూ.2500 కోట్లతో పెట్టుబడులు

- సీఎం స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందం
- అబెర్టిస్ కంపెనీ ప్రతినిధులతో భేటి

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సరకుల గోదాములు, గూడ్సు పార్కులు నెలకొల్పడంలో ప్రపంచ ప్రఖ్యాతిగడించిన హబక్ లాయిడ్ కంపెనీ రాష్ట్రంలో రూ.2500 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నగరంలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా గురువారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ కంపెనీ ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలోని తూత్తుకుడి సహా పలు ప్రాంతాల్లో హబక్ లాయిడ్ కంపెనీ తన సంస్థలను నెలకొల్పనుంది. దీనితో సుమారు వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. తొలుత ముఖ్యమంత్రి స్టాలిన్‌ను, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజాను హబక్ లాయిడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జెస్పర్ కాన్‌స్ట్రప్, డైరెక్టర్ ఆల్బర్ట్ లోరెంటీ కలుసుకుని కొత్త పరిశ్రమల స్థాపన గురించి సమగ్రంగా చర్చలు జరిపారు. ఆ తర్వాత ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

రహదారుల నిర్మాణంలో అబెర్టిస్ కంపెనీ..

రహదారుల నిర్మాణ పనులలో పేరుగడించిన అబెర్టిస్ కంపెనీ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంపై చర్చలు జరిపారు. ఆ మేరకు రాష్ట్ర రహదారుల శాఖలో తమ కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమేనని, ఆ మేరకు త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటామని ఆ కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, మార్గదర్శక (గైడెన్స్) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి. విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఈసారి ఎయిమ్స్‌కు ఉత్తిచేతులే!


నిర్మలా సీతారామన్

- మధ్యంతర బడ్జెట్లో కనికరించని నిర్మలమ్మ
- ఇది రాష్ట్రానికి కేంద్రం చేసిన ద్రోహం: స్టాలిన్
- రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదు: అన్నాడీఎంకే

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో నిర్మించతలపెట్టిన 'ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (ఎయిమ్స్)పై కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి కూడా 'సారీ' చెప్పేశారు. గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్లోనైనా మదురై ఎయిమ్స్‌కు భారీగా నిధులు కేటాయిస్తారని అన్ని వర్గాలు గంపెడాశతో ఎదురు చూశాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అయినా మదురై జిల్లా తోప్పూర్‌లో నిర్మించతలపెట్టిన ఎయిమ్స్‌కు మోక్షం కల్పిస్తారని రాజకీయవర్గాలు ఆశించాయి. కానీ నిర్మలమ్మ మాత్రం ఇటువైపు దృష్టి మరల్చకపోవడం పట్ల బీజేపీవర్గాలు సైతం అసంతృప్తితో వున్నాయి. నిర్మలా సీతారామన్ తన మధ్యంతర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా తమ ప్రభుత్వం నిర్మిస్తున్న ఎయిమ్స్, ఐఐటీల జాబితాను ఏకరువుపెట్టారు. కానీ మదురై ఎయిమ్స్‌ను మాత్రం విస్మరించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో సైతం తీవ్ర చర్చ జరుగుతోంది. 2015 ఫిబ్రవరి 28వ తేదీన పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మదురై జిల్లాలో ఎయిమ్స్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. అయితే 2019 వరకు ఆయన ప్రకటనకు సంబంధించిన కార్యాచరణకు అతీగతీ లేకుండాపోయింది. అయితే 2019లో పార్లమెంటు ఎన్నికలకు ముందు, అంటే జనవరి మాసంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తోప్పూర్ ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు ఆ ప్రాంతం చుట్టూ ప్రహరీ కట్టి, అంతటితో వదిలేశారు. 2020 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థలాన్ని కేంద్రప్రభుత్వానికి అప్పగించింది. ఆ తరువాత 2022లో దీని నిర్మాణానికి సంబంధించి 'జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ' ఒప్పందంపై సంతకం చేసింది. ఆ తరువాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నిలిచిపోయింది. అయితే డిసెంబరులో మదురై వచ్చిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి ఎస్‌పీ సింగ్ భగేల్ మాట్లాడుతూ.. 2024 జనవరిలో టెండర్లు ఖరారు చేస్తామని, మూడేళ్లలో పనులు పూర్తవుతాయని ప్రకటించారు. కానీ ఈ మధ్యంతర బడ్జెట్లో మదురై ఎయిమ్స్‌కు లేశమాత్రమైనా నిధులు కేటాయించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు రేగుతున్నాయి. అంతేగాక కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు భారీగా పెండింగ్‌లో వున్నాయి. వాటి ప్రస్తావన కూడా నిర్మల బడ్జెట్లో లేకపోయింది. ఇక రాష్ట్రానికి సంబంధించిన పథకాలు గానీ, కొత్త రైల్వే ప్రాజెక్టుల ప్రస్తావనీ గానీ లేకపోయింది. ఇదిలా వుండగా ఇది మధ్యంతర బడ్జెట్టే అయినందున అంతగా పట్టించుకోలేదని, మూడోసారి ముచ్చటగా మోదీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్లో రాష్ట్రానికి భారీ నిధులు వస్తాయని బీజేపీ వర్గాలు చెబుతున్నప్పటికీ ప్రజల నుంచి మాత్రం అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా బడ్జెట్ పట్ల అన్నాడీఎంకే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే పథకాలేవీ ఈ బడ్జెట్లో లేవని, ఆమె రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని అన్నాడీఎంకే సీనియర్ నేత డి.జయకుమార్ విమర్శించారు. కానీ ఈ వ్యవహారంపై డీఎంకే నేతలెవ్వరూ పోరు మెదపకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు.

తమిళనాడుకు మొండిచేయి : స్టాలిన్

మధ్యంతర బడ్జెట్లో తమిళనాడుకు ఎలాంటి మేలు జరగదని ముఖ్యమంత్రి స్టాలిన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. సాధారణ, సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలకు కేంద్ర బడ్జెట్లో ఎలాంటి ప్రకటనలు లేవని, ఆదాయ పన్ను పరిమితిలో రాయితీలుంటాయని ఎదురు చూసిన ప్రజలు.. నిరాశ చెందారన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అనువుగా ఈ బడ్జెట్ లేదని, మంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలను మోసగించేలా బడ్జెట్‌లోని అంశాలను చదివారన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సిలిండర్ ధరలు తగ్గిస్తారని ఎదురు చూశారన్నారు. అయితే చివరకు ప్రజలకు ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు ప్రకటించలేదన్నారు. ఇది మొండి చేయి చూపిన బడ్జెట్‌గానే పరిగణిస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు. దేశంలో జీఎస్టీ అమలులోకి వచ్చాక పన్నుల రాబడి విపరీతంగా పెరిగిందని, బీజేపీ ప్రభుత్వం సాధించిన ఘనత అదొక్కటేనని ఎద్దేవా చేశారు. అయితే రాష్ట్రాలకు రావాల్సిన జీఎస్టీ నష్టపరిహారాన్ని ఈ సంవత్సరం కూడా ప్రకటించలేదన్నారు. ఇందువల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే తమిళనాడుకు రూ.20 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. కొత్త సంవత్సరంలో 15 ఎయిమ్స్ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్లో ప్రకటించారని, 2019లో మోదీ ప్రధాని శంకుస్థాపన చేసిన మదురై ఎయిమ్స్‌కు ఇప్పటి వరకూ అతీగతీ లేదన్నారు. ఇందుకు గల కారణాలను కేంద్రమే చెప్పాలని డిమాండ్ చేశారు.



ప్రసంగిస్తున్న పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ - సమావేశంలో పాల్గొన్న పీఎంకే సర్వసభ్య మండలి సభ్యులు, పార్టీ ప్రముఖులు

పొత్తు లేకున్నా 7 లోక్‌సభ స్థానాల్లో గెలుస్తాం

- పీఎంకే సర్వసభ్యమండలిలో రాందాస్ ధీమా

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీతో పొత్తుపెట్టుకునేందుకు ఆరాటపడుతున్నాయని, ఏ పార్టీతో పొత్తుపెట్టుకోకపోయినా ఏడు నియోజకవర్గాల్లో గెలిచే సత్తా తమకుందని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ధీమా వ్యక్తంచేశారు. ఎగ్మూరులోని కళ్యాణమండపంలో గురువారం జరిగిన పీఎంకే సర్వసభ్య మండలి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఇటు డీఎంకే, అటు అన్నాడీఎంకే పీఎంకేని తమ కూటమిలో చేర్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఈ రెండు పార్టీలకు తోడు బీజేపీ నాయకులు కూడా పీఎంకే నేతలతో రహస్యంగా చర్చలు జరుపుతున్నారు. ఈ పరిస్థితులలో పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య మండలి సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ లోక్‌సభ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుండే శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకే ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోదలిచామని, ఒంటరిగా పోటీచేస్తే ఏడు నియోజకవర్గాల్లో, పొత్తుపెట్టుకుని పోటీ చేస్తే 10 నియోజకవర్గాలలో గెలిచి తీరుతామని రాందాస్ అన్నారు. సమావేశంలో పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఏకే మూర్తి, అరుళ్‌మొళి, శాసనసభ్యులు ఇరా అరుళ్, వెంకటేశన్, సదాశివం, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

రాందాస్‌కే పొత్తుపై నిర్ణయాధికారం..

ఈ సమావేశంలో పార్టీ నేత అన్బుమణి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం వెల్లివిరిసిందని, ప్రస్తుతం లోక్‌సభలో పార్టీ సభ్యులు ఎవరూ లేకపోవడంతో బలహీనవర్గాలవారికి జాతీయ స్థాయి రిజర్వేషన్లలో స్థానం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఓ తీర్మానం చేసి ఆమోదించారు. వన్నియార్లకు రిజర్వేషన్లు కల్పించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేశారు. చివరగా లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌కు అప్పగిస్తూ తీర్మానం చేశారు.

ఐసీఎఫ్ జీఎంగా సుబ్బారావు

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ' (ఐసీఎఫ్) జనరల్ మేనేజర్‌గా యు.సుబ్బారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ




ఆ స్థానంలో వున్న బీజీ మాల్యా వున్న విషయం తెలిసిందే. 'ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్' (ఐఆర్‌ఎస్‌ఎంఈ) 1987కు చెందిన సుబ్బారావు మెకానికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్, పబ్లిక్ పాలసీ అండ్ మేనేజ్‌మెంట్‌లో పీజీ చేశారు. ఐఆర్‌ఎస్‌ఎంఏ అధికారికగా ఎంపికయ్యాక హుబ్లీలోని దక్షిణ పశ్చిమ రైల్వేకు అడిషనల్ జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. అంతేగాక అక్కడ ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గాను, దక్షిణ మధ్య రైల్వేలో చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (ప్లానింగ్)గానూ బాధ్యతలు నిర్వర్తించారు. అంతేగాక సేలం డివిజన్, దక్షిణరైల్వే తదితర విభాగాల్లో ఉన్నతాధికారిగా బాధ్యతలు పూర్తి చేశారు. అంతేగాక ప్యారీస్, జోహాన్స్‌బర్గ్, యూఎస్‌ఏ వంటి విదేశీ ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లోనూ పాల్గొని తన అనుభవాన్ని విశదీకరించారు.

12 నుంచి అసెంబ్లీ

- గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- 19న బడ్జెట్ దాఖలు

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తొలిసారిగా రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 12వ తేదీన ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ స్పీకర్ అప్పావు గురువారం మధ్యాహ్నం తన ఛాంబర్‌లో విలేఖరులతో మాట్లాడుతూ 12వ తేదీ ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగం ప్రారంభమవుతుందన్నారు. అదే విధంగా వార్షిక బడ్జెట్ ఈ నెల 19వ తేదీన దాఖలవుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్ సీటు వ్యవహారం గురించి విలేఖరులు ప్రస్తావించినప్పుడు సభలో ఎవరిని ఏ సీటులో కూర్చోబెట్టాలనే విషయంపై నిర్ణయాధికారం తనదేనని చెప్పారు. శాసనసభ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలనే ప్రభుత్వం భావిస్తోందని, నిర్విరామంగా ప్రత్యక్ష ప్రసారం చేయడం ఖర్చుతో కూడిన వ్యవహారం కనుక ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన మంత్రి వర్గ సహచరులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అప్పావు తెలిపారు.

వైవీ రామకృష్ణ కన్నుమూత



చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకుడు వైవీ రామకృష్ణ (80) అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి స్థానిక రాయపురంలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయన అంతిమ కోరిక మేరకు కుటుంబీకులు శ్రీరామచంద్ర మెడికల్ యూనివర్సిటీకి ఆయన మృతదేహాన్ని దానం చేశారు. పొట్టి శ్రీరాములు ప్రధాన అనుచరుడైన వైవీ శాస్త్రి కుమారుడే వైవీ రామకృష్ణ. ఈయన తెలుగు భాష, సాహిత్యం కోసం ఎంతో పాటుపడ్డారు. అలాగే తెలుగు సంస్థలకు ఆయన ఎన్నో సహాయ సహకారాలు అందించారు.

తండ్రికి ఇచ్చిన మాట కోసం....

స్థానిక మైలాపూరులోని పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వహణను జాగ్రత్తగా చూసుకోవాలని తన తండ్రి వైవీ శాస్త్రి సూచనల మేరకు ఆయన భవన నిర్వహణకు కృషి చేశారు. ఆయనపై అపనిందలు పడినా నిస్వార్థంగా ఈ భవన సంరక్షణకు పాటుపడ్డారు. చివరకు ఈ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కమిటీ నియమించడంతో ఆయన ఆయన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అయినా పొట్టి శ్రీరాములు స్మారక సమితి పేరుతో సంస్థను ఏర్పాటుచేసి నెలానెలా వెన్నెల పేరుతో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈయన సమితి వ్యవస్థాపక కార్యదర్శిగా ఉండగా అజంతా శంకరరావు వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. అవివాహితుడైన వైవీ రామకృష్ణ దక్షిణాఫ్రికాలో మంచి ఉద్యోగం సైతం వదులుకుని ఇక్కడి వచ్చి సేవలు అందించారు.

బిన్నీ మిల్లు స్థల ఆక్రమణల తొలగింపు వ్యవహారం

- నగరంలో 5 చోట్ల ఏసీబీ సోదాలు

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియాంతోపు ప్రాంతంలో మూతపడిన బిన్నీ మిల్లు స్థలాన్ని ఆక్రమించుకున్న వారిని తొలగించేందుకు మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లకు రూ.50 కోట్ల మేరకు ముడుపులు ఇచ్చిన వ్యవహారం తీవ్ర రూపం దాల్చింది. ముడుపులు చెల్లించిన కట్టడ నిర్మాణ సంస్థల అధినేతలపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు గురువారం నగరంలోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.బిన్నీ మిల్లు ప్రాంగణంలో రెసిడెన్షియల్ ప్లాట్లను నిర్మించేందుకు రెండు రియల్ ఎస్టేట్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ సమయంలో 14.16 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని ఆక్రమించుకున్నవారిని తొలగించేందుకు ఆ రియల్ ఎస్టేట్ సంస్థలు మాజీ ఎంపీకి రూ.23లక్షలు, మరో ఎంపీకి రూ.20లక్షలు, పార్టీ ప్రముఖుడొకరికి రూ.33 లక్షలు, మాజీ మహిళా కౌన్సిలర్‌కు రూ.2లక్షలు, మాజీ శాసనసభ్యుడికి రూ.30లక్షల చొప్పున ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతోంది. ఆ విచారణలో భాగంగా గురువారం ఉదయం రియల్‌ఎస్టేట్ సంస్థల భాగస్వాములు ఉదయకుమార్, సునీల్, కెత్వాలియా మనీస్ తదితరులకు చెందిన ఐదు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

బీజేపీని ఓడించడమే డీఎంకే కూటమి లక్ష్యం

మంత్రి ఉదయనిధి

ప్యారీస్, ఫిబ్రవరి 1: పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 స్థానాల్లో బీజేపీని ఓడించడమే డీఎంకే కూటమి లక్ష్యమని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. స్థానిక రాయపురం నియోజకవర్గంలో 16 విద్యార్థి సంఘాల కలయికతో ఏర్పాటైన ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మెగా విద్యార్థుల ర్యాలీని గురువారం ఉదయం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డీఎంకే విద్యార్థి విభాగం, వివిధ సంస్థల నిర్వహణలోని విద్యార్థుల సంఘాలన్నీ ఏకమై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతను ఎండగడుతూ భారీస్థాయిలో ర్యాలీ నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశముందన్నారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని ప్రతిరోజూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇలాంటి ర్యాలీలను విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు డీఎంకే అన్నివిధాలా సహకరిస్తుందన్నారు. సేలంలో ఇటీవల జరిగిన డీఎంకే యువజన విభాగం మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మతవాద బీజేపీ ప్రభుత్వం బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో విద్యా హక్కులను లాక్కొంటోందని, వాటిని తిరిగి రాబట్టుకొనేలా, జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించేలా, 5, 8 తరగతులకు పబ్లిక్ పరీక్షలు, నీట్ పరీక్ష రద్దు చేయాలన్న డిమాండ్లతో విద్యార్థి సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని 40 స్థానాల్లో గెలిపించేలా విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టాలని మంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు.


విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

సమాచార ధ్వని

ఎంఫిల్ కోర్సుకు మళ్లీ అనుమతి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: రద్దయిన ఎంఫిల్ కోర్సులో రెండు పాఠ్య విభాగాలకు మాత్రమే రెండేళ్లకు అడ్మిషన్లు నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ అనుమతినిచ్చింది. పీజీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో చేరేందుకు, పీహెచ్‌డీ చదివేందుకు ఎంఫిల్ చదవాల్సి ఉంది. అయితే ఈ కోర్సు అవసరం లేదని గతంలో రద్దు చేశారు. ఈ నేపథ్యంలో, రెండు పాఠ్య విభాగాలకు మాత్రం 2025-26 విద్యా సంవత్సరం వరకు విద్యార్థులను చేర్చుకోవచ్చని యూజీసీ ప్రకటించింది. క్లినికల్ సైకాలజీ, సైక్రియాటిస్ట్ సోషల్ వర్క్ కోర్సులకు కేంద్రవిద్యాశాఖ అనుమతిచ్చింది.

'క్యూట్' పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: క్యూట్ ప్రవేశ పరీక్షకు ఈ నెల 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని జాతీయ పరీక్షల ఏజెన్సీ ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర విశ్వవిద్యాలయాలు, వాటి ఆధ్వర్యంలో పనిచేసే కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు క్యూట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్షను జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం (2024-25) క్యూట్ పరీక్ష మార్చి 11 నుంచి 28వ తేది వరకు జరుగనుండగా, దరఖాస్తు స్వీకరణ గత డిసెంబరు 26వ తేది నుంచి జరుగుతోంది. బుధవారంతో ముగిసిన ఈ గడువును ఈ నెల 7వ తేది వరకు పొడిగించారు. దరఖాస్తు రుసుము చెల్లింపుకు ఈ నెల 8, సవరణలకు 9 నుంచి 11వ తేది వరకు అవకాశం కల్పించారు. హాల్ టిక్కెట్లు మార్చి 7వ తేది విడుదల చేయనున్నారు. ఇతర వివరాలకు 011-40759000 నెంబరు సంప్రదించవచ్చు.

ఐటీఐ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: ఐటీఐ ఉప వృత్తులకు సంబంధించిన పరీక్షలు రాసేందుకు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యోగావకాశాలు, శిక్షణ శాఖ కమిషనర్ సుందరవల్లి తెలిపారు. క్రాఫ్ట్‌మ్యాన్ శిక్షణ పథకం కింద 2017-19 సంవత్సరంలో వృత్తి శిక్షణ కేంద్రాల్లో రెండవ ఏట అడ్మిషన్లు జరిగాయి. వారిలో అన్ని అర్హతలుండి పరీక్షలో పాల్గొనని వారు, ఫెయిలైన వారి కోసం మార్చిలో పరీక్ష జరుగనుంది. దీనికి సంబంధించి మాజీ ట్రైనీలు తాము చదివిన కేంద్రాలను ఈ నెల 15వ తేదిలోపు సంప్రదించి, ఆయా పాఠ్యాంశాలకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

రాష్ట్రంలో 100 మంది డీఎస్పీల బదిలీ

పెరంబూర్, ఫిబ్రవరి 1: రాష్ట్రవ్యాప్తంగా 100 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులతో, ఒకే ప్రాంతంలో మూడేళ్లుగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు బదిలీ ప్రక్రియ వేగవంతమైంది. పోలీసు శాఖలో కూడా ఐజీ నుంచి పోలీసుల వరకు బదిలీ జరుగుతుండగా, తాజాగా 100మంది డీఎస్పీలను బదిలీచేస్తూ డీజీపీ ఉత్తర్వులుజారీచేశారు.

15న వాలీబాల్ పోటీలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: స్థానిక సెంట్రల్ సమీపంలోని నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15వ తేది నుంచి మార్చి 21వ తేది వరకు ప్రైమ్ వాలీబాల్ లీగ్ పోటీలు జరుగనున్నాయి. అహమ్మదాబాద్, బెంగుళూరు, కోలికోడ్, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్, కోల్‌కత్తా, ముంబై, ఢిల్లీ జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీలో గెలుపొందే వారు ఫైనల్‌కు చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: ఎగ్మూర్, ఆవడి, పెరంబూర్ మండలాల్లో విద్యుత్ గ్రీవెన్స్ శుక్రవారం జరగనుంది. ఓట్టేరిలో ఉన్న ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఎగ్మూర్ పరిధికి చెందిన వారు, ఆవడి ఇంజనీర్ కార్యాలయంలో జరగనున్న శిబిరంలో అదేప్రాంతానికి చెందిన వారు, పెరంబూర్ ఇంజనీర్ కార్యాలయంలో ఆ ప్రాంత వినియోగదారులు తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

5న ప్రజాభిప్రాయ సేకరణ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: స్థానిక పెరుంగుడి డంపింగ్ యార్డ్‌లో పర్యావరణ పార్క్ ఏర్పాటుచేయడంపై ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 5వ తేది జరుగనుంది. ఉదయం 11 గంటలకు పెరుంగుడి మండలం 148వ వార్డు కార్యాలయంలో మేయర్, దక్షిణ చెన్నై ఎంపీ, షోలింగనల్లూర్ ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ సమావేశంలో ప్రజలు పాల్గొని, పార్క్ ఏర్పాటుపై తమ అభిప్రాయాలు వెల్లడించాలని చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: విద్యుత్ మరమ్మతుల కారణంగా అంబత్తూర్, పెరంబూర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: తిరువేర్కాడు, పులియంబేడు, జడ్జస్ కాలనీ, తుండలం, పెరియమేడు, రాజాస్ గార్డెన్

పెరంబూర్: సెంబియం కావేరి 1 నుంచి 8 వీధులు, తండయార్‌పేట హైరోడ్డు, సెంబియం మొత్తం, పెరంబూర్ హైరోడ్డు, కొడుంగైయూర్, జీఎన్‌టీ రోడ్డు, గాంధీ నగర్, పీబీ రోడ్డు, మాధవరం, మాధవరం హైరోడ్డు

పెరిగిన వాణిజ్య సిలిండర్ ధరలు

పెరంబూర్, ఫిబ్రవరి 1:వాణిజ్య గ్యాస్‌సిలిండర్ ధరలు పెరిగాయి.ఈ మేరకు ఆయిల్ సంస్థలు గురువారం విడుదల చేసిన ప్రకటనలో... వాణిజ్య వినియోగ సిలిండర్ (19కిలోలు) గతనెలలో రూ.1,924.50 ఉండగా, ఈ నెలలో రూ.12.50 పెరిగి రూ.1,937కు చేరుకుంది. అదే సమయంలో వంట గ్యాస్ సిలిండర్ (14.2 కిలోలు) ధరల్లో ఎలాంటి మార్పులు లేకపోగా రూ.918.50కి విక్రయమవుతోందని ఆయిల్ సంస్థలు తెలిపాయి.

చెన్నై- అయోధ్య విమాన సేవలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 1: చెన్నై-అయోధ్య మధ్య విమాన సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. స్పైస్ జెట్ విమానం ప్రతిరోజు చెన్నై నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి 3.15 గంటలకు అయోధ్య చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 4 గంటలకు అయోధ్యలో బయల్దేరి 6.20 గంటలకు చెన్నై చేరుకుంటుంది. 180 సీట్ల సామర్థ్యంతో కూడిన బోయింగ్ 737-8 రకం విమానంలో ఛార్జీగా ఒకరికి రూ.6,499గా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

మరచి వెళ్లిన ఆభరణం అప్పగింత

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 1: వసతి గదిలో మరిచివెళ్లిన ఆభరణాన్ని భక్తుడికి అప్పగించి టీటీడీ ఉద్యోగులు నిజాయితీ చాటుకున్నారు. తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన విశాల్ శ్రీనివాసం వసతి సముదాయంలోని 407 గదిని గురువారం ఖాళీ చేశారు. హడావుడిలో 20గ్రాముల బంగారు ఆభరణాన్ని మరిచివెళ్లిపోయారు. గదిని శుభ్రం చేయడానికి వెళ్లిన పారిశుధ్య కార్మికులకు అది లభించింది. శ్రీనివాసం మేనేజర్ కె.శ్రీనివాసులుకు సమాచారం అందజేశారు. భక్తుడి సెల్ నంబర్ ఆధారంగా పిలిపించి ఆభరణాన్ని అప్పగించారు. కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ కరువు

● అన్నాడీఎంకే మాజీ ఎంపీ బాలగంగ



స్థానిక ఎగ్మూర్‌లో బాలగంగ నేతృత్వంలో చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న అన్నాడీఎంకే శ్రేణులు

ప్యారీస్, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ కరువైందని, దళిత కాలనీల్లో సరఫరా చేసే తాగునీటి తొట్టిలో మానవ వ్యర్థాలు కలిపిన వారిపై ఎలాంటి చర్యలు లేవని అన్నాడీఎంకే మాజీ ఎంపీ ఎన్.బాలగంగ వ్యాఖ్యానించారు. పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే కరుణానిధి కుమారుడు, కోడలు ఇంట్లో పనిచేసిన దళిత విద్యార్థినిపై దాడి జరపడాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉదయం ఎగ్మూర్ రాజారత్నం స్టేడియంలో సమీపంలో అన్నాడీఎంకే ఉత్తర చెన్నై దక్షిణ పశ్చిమ జిల్లాల కార్యదర్శి, మాజీ ఎంపీ బాలగంగ అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్, హార్బర్ ప్రాంతీయ కార్యదర్శి వెట్రిలై మారిముత్తు, మాజీ కౌన్సిలర్ ఆవిన్ అరుణ్ సహా పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని, డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాలగంగ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అణగారిన వర్గాల మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు కొనసాగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు, కోడలిపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని, బాధిత విద్యార్థినికి నష్టపరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా, తిరువళ్లూర్ జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి పి.బెంజిమెన్ అధ్యక్షతన వెల్లవేడులో, ఉత్తర చెన్నై అన్నాడీఎంకే జిల్లా అధ్యక్షుడు ఆర్ఎస్ రాజేష్ నేతృత్వంలో ఆర్కే నగర్‌లో నిర్వహించిన ధర్నాల్లో అన్నాడీఎంకే శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రూ.4157 కోట్లతో ఆలయాల జీర్ణోద్ధరణ పనులు

● మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటన

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రూ.4157 కోట్ల వ్యయంతో ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు, గోశాలలు, తీర్థకొలనులు, కల్యాణ మండపాలు తదితర నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. స్థానిక వలసరవాక్కం అగస్త్రీశ్వరర్ వెళ్లీశ్వరర్ ఆలయం వద్ద రూ.2.99 కోట్ల వ్యయంతో తీర్థకొలను మరమ్మతు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటివరకూ దేవాదాయ శాఖ ఎనిమిదివేలకు పైగా ఆలయాల్లో మరమ్మతు పనులు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ పనులన్నీ చురుకుగా సాగుతున్నాయని ఆయన వివరించారు.

ఈడీ అధికారి బెయిల్ పిటిషన్ 5కు వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 1: ఈడీ అధికారి అంకిత్ తివారీ బెయిల్ పిటిషన్ విచారణ దిండుగల్ న్యాయస్థానం ఈ నెల 5వ తేదీకి వాయిదావేసింది. ప్రభుత్వ వైద్యుడి నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకున్నారనే వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అంకిత్ తివారీని గత డిసెంబరు 1వ తేది అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మదురై కేంద్ర కారాగారంలో ఉన్న అంకిత్ తివారీ బెయిల్ కోరుతూ దాఖలుచేసిన పిటిషన్లను దిండుగల్ న్యాయస్థానం, మద్రాసు హైకోర్టు తోసిపుచ్చాయి. ఈ నేపథ్యంలో, బెయిలు కోరుతూ రెండవ సారి దాఖలుచేసిన పిటిషన్‌ను దిండుగల్ న్యాయస్థానం ఈ నెల 5వ తేదీకి వాయిదావేసింది.

1,350 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 1: వేసవి విద్యుత్ అవసరాలు భర్తీచేసేలా మార్చి నుంచి మే వరకు 1350 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర విద్యుత్ బోర్డు నాలుగు రాష్ట్రాలతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు రోజుకు 15 వేల మెగావాట్లు ఉండగా, వేసవిలో 20,744 మెగావాట్లకు పెరుగుతుంది. ఈ అవసరాలు భర్తీచేసేందుకు పరస్పర విద్యుత్ మార్పిడి పథకం కింద మార్చిలో 500 మెగావాట్లు, ఏప్రిల్‌లో 600 మెగావాట్లు, మేలో 250 మెగావాట్లు కొనుగోలు చేసేందుకు రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల విద్యుత్ శాఖలతో రాష్ట్ర విద్యుత్ బోర్డు ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే, రాష్ట్రంలో మే నుంచి పవన విద్యుత్ సీజన్ ప్రారంభం కానుండగా, ఈ సీజన్‌లో రోజుకు 2,500 మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి కానుంది.

నగర శివార్లలో సమాచార సాంకేతిక పార్క్‌లు

ప్యారీస్, ఫిబ్రవరి 1: నగర శివారు ప్రాంతాలైన వండలూరు, మలయంబాక్కం, మన్నివాక్కం ప్రాంతాల్లో సమాచార సాంకేతిక పార్క్‌లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించే విధంగా శివారులోని మూడు ప్రాంతాల్లో సమాచార సాంకేతిక పార్క్‌లు ఏర్పాటుచేయాలని సీఎండీఏ ప్రతిపాదించింది. ఈ కోరికను పరిశీలించిన ప్రభుత్వం, పార్క్‌ల ఏర్పాటుకు అనుమతి జారీచేసింది. మలయంబాక్కం ప్రాంతంలో 5.33 ఎకరాల విస్తీర్ణంలో ఒక ఎకరాకు రూ.3 కోట్ల విలువతో, మన్నివాక్కంలో 5.04 ఎకరాల విస్తీర్ణంలో రూ.5 కోట్లతో, వండలూరులో 0.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.28.05 కోట్లతో ఆధునిక పార్క్‌లు నిర్మించి ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు రాబట్టుకొని, నిరుద్యోగ యువతకు అధికస్థాయిలో ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించడం గమనార్హం.

తిరువలం పంచాయతీలో కలెక్టర్ పర్యటన

వేలూరు, ఫిబ్రవరి 1: 'మిమ్మల్ని వెతుకుతూ మీ ఊరిలో' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సుబ్బులక్ష్మి గురువారం తిరువలం పంచాయతీలో పర్యటించారు. బుధవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు పంచాయతీలోని పలు ప్రాం తాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలు, రైతులను కలెక్టర్ కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతి యూనియన్ అధ్యక్షురాలు చాముండేశ్వరి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తీ, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓమందూర్‌రెడ్డికి గవర్నర్ నివాళి



చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దార్శనికుడు, సామాజిక న్యాయ పోరాటయోధుడు ఓమందూరు రామస్వామి రెడ్డికి రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఘన నివాళులర్పించారు. రామస్వామిరెడ్డి 129వ జయంతిని పురస్కరించుకుని గురువారం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి గవర్నర్ పుష్పమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా అఖిల భారత తెలుగు సమాఖ్య వ్యవస్థాపకుడు ఆచార్య సీఎంకే రెడ్డి కూడా రామస్వామికి నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. "దిండివనం జిల్లా ఓమండూరులో రైతు కుటుంబంలో జన్మించిన రామస్వామి స్వాతంత్ర్య సమరయోధుడు. సామాజిక కార్యకర్త, రాజనీతిజ్ఞుడు. ఆయన స్వాతంత్ర్యానంతరం 1947 మార్చి నుంచి 1949 ఏప్రిల్ వరకు మద్రాస్ ప్రెసిడెన్సీకి మొదటి ప్రీమియర్‌గా వ్యవహరించారు. దళితులను ఆలయాల్లోకి అనుమతించడానికి, దేవదాసీ వ్యవస్థను రద్దు చేయడానికి చట్టాలను తీసుకొచ్చారు. ఆయన హైదరాబాద్ రజాకార్లతో పోరాడేందుకు సర్దార్ పటేల్‌కు సాయపడ్డారు. అదే విధంగా హైదరాబాద్‌ను భారతదేశ ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు దోహదపడ్డారు. సీఎంగా ఆయన సరళత, నిజాయితీ, చిత్తశుద్ధి, పారదర్శకతకు పేరుగాంచారు. ఆయన కోసం ఓమందూర్‌లో మణిమంటపం వుంది. చెన్నైలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆయన పేరు పెట్టారు. ఆయన జయంతి, వర్ధంతులు ప్రతి సంవత్సరం ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహించబడుతున్నాయి" అని ఆచార్య సీఎంకే రెడ్డి నివాళులర్పించారు.

యువత సద్గుణాలను అలవర్చుకోవాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పోలీసు కమిషనర్

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నేటి యువత ఇతరులకు స్ఫూర్తినిచ్చే సద్గుణాలను అలవర్చుకోవడం తప్పనిసరి అని చెన్నై పోలీసు కమిషనర్ డాక్టర్ సందీప్ రాయ్ రాథోడ్ పిలుపునిచ్చారు. స్థానిక వేళచ్చేరిలోని గురునానక్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలులో 'గురుశిక్షా' పేరుతో విద్యార్థులకు నిర్వహించిన ఆంగ్ల, హిందీ, తమిళం భాషా వక్తృత్వ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు రకరకాల విలువైన బహుమతులు అందించారు.

పెట్టుబడుల సమీకరణపై శ్వేతపత్రం

కేంద్రమంత్రి ఎల్.మురుగన్ డిమాండ్

పెరంబూర్, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ రాష్ట్రప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎంకే అధికారం చేపట్టిన 14 నెలల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సమీకరించినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారన్నారు. అనంతరం సింగపూర్-జపాన్ దేశాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి, తొలుత రూ.1,258 కోట్లు అని, అనంతరం రూ.3,233 కోట్లు పెట్టుబడులు సమీకరించినట్లు పేర్కొన్నారన్నారు. ఇటీవల నగరంలో నిర్వహించిన మహానాడులో రూ.6.64 లక్షల కోట్లు పెట్టుబడులు సమీకరించినట్లు, 26,90,657 మందికి ఉపాధి లభిస్తుందని డీఎంకే ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోందన్నారు. పెట్టుబడులపై జరిగిన ఒప్పందాలు ఎన్ని? వాటిలో పరిశ్రమలు స్థాపించినవి ఎన్ని? ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? అనే విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు.

ప్రధాని సభకు పల్లడంలో 400 ఎకరాల ఎంపిక

పెరంబూర్, ఫిబ్రవరి 1: ఈ నెల 18వ తేది ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న బహిరంగ సభ కోసం పల్లడం సమీపం మాదప్పూర్‌లో 400 ఎకరాల్లో సభా ప్రాంగణం సిద్ధమవుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన పాదయాత్ర ఈ నెల 18వ తేది పల్లడంలో ముగియనుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఈ సభకు సుమారు 5 లక్షల మందిని తరలించాలని ఆ పార్టీ శ్రేణులు సన్నాహాలు చేపట్టాయి.

రాష్ట్ర హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి : సీపీఎం

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులపై నిరంతరం దాడి చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. బీజేపీయేతర పక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలను మోసం చేయడానికి నిధుల కేటాయింపుతో సహా అనేక అంశాల్లో వివక్ష చూపుతోందని, గవర్నర్లను ప్రయోగించి శాసనసభలో ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపడం, రాష్ట్రాలకు సరిపడా నిధులు కేటాయించకపోవడం, రాష్ట్రాల అభివృద్ధికి రుణాలు తీసుకోకుండా నిషేధించడం వంటి కుత్సిత పనులకు ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్, న్యూఢిల్లీ సహా అనేక రాష్ట్రాల ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను స్తంభింపజేసేందుకు గవర్నర్‌ను ఉపయోగించుకుంటోందన్నారు. ఇదిలా వుండగా ఈ నెల 8వ తేదీన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో ఢిల్లీలో భారీ ధర్నా చేపట్టనున్నామని వివరించారు.

'ఇల్లం తేడి కల్వి' పథకానికి రూ.100 కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 1: 'ఇల్లం తేడి కల్వి' పథకానికి రూ.100 కోట్లు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి జె.కుమరగురుపరన్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో... కరోనా కాలంలో 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు విద్యలో ఏర్పడిన అంతరాయం భర్తీ చేసేలా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన 'ఇల్లం తేడి కల్వి' పథకానికి అప్పట్లో రూ.199.96 కోట్లు కేటాయించామన్నారు. అలాగే, 2021 నవంబరులో రూ.50 కోట్లు, 2022 మార్చిలో రూ.114.17 కోట్లు, సెప్టెంబరులో రూ.173.31 కోట్లు, 2023 మార్చిలో రూ.52.85 కోట్లు, సెప్టెంబరులో రూ.100 కోట్లు కేటాయించామని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ పథకంలో పనిచేస్తున్న 1.80 లక్షల కేంద్రాలను 1.25 లక్షలకు తగ్గించనున్నట్లు తెలిపారు.

నిర్భయ టీమ్ సేవలు ప్రశంసనీయం

● గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్



అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

ప్యారీస్, ఫిబ్రవరి 1: మహిళలకు రక్షణ కవచంగా నిర్భయ టీమ్‌లు పనిచేస్తున్నాయని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పేర్కొన్నారు. ఎగ్మూర్‌లోని రాజరత్నం స్టేడియంలో గురువారం ఉదయం గ్రేటర్ చెన్నై సిటీ పోలీసు, ఇండియన్ వెల్ఫేర్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ ప్రపంచంలో మహిళకు రక్షణ అనే నినాదంతో యూత్ అవగాహన ర్యాలీని పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఐయూసీఏడబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ కేపీ పార్వతి, ఐసీడబ్ల్యూఓ కార్యదర్శి ఏజే హరిహరన్‌ల నేతృత్వంలో నగరంలోని మహిళా కళాశాలల విద్యార్థినులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ అవగాహన ర్యాలీలో ప్లకార్డులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్‌రాయ్ రాథోడ్ మాట్లాడుతూ... రాజధాని నగరంలో మహిళలకు భద్రత కల్పించేలా 37 మహిళా పోలీసుస్టేషన్లు అందుబాటులో ఉన్నాయని, వీటి సహకారంతో ప్రమాదంలో చిక్కుకున్న మహిళలను అప్పటికప్పుడు రక్షించేందుకు నిర్భయ టీమ్‌లు పనిచేస్తున్నాయన్నారు.

తూత్తుకుడి తుపాకి కాల్పుల వ్యవహారం

అధికారులకు నోటీసులు

పెరంబూర్, ఫిబ్రవరి 1: తూత్తుకుడి తుపాకి కాల్పుల వ్యవహారంలో నేరారోపణలు ఎదుర్కొంటున్న 17 మంది అధికారులు బదులు పిటిషన్ దాఖలుచేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గత 2018లో తూత్తుకుడి స్టెరిలైట్ కర్మాగారానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో హింస చెలరేగడంతో, పోలీసులు జరిపిన కాల్పుల్లో 13 మంది మృతిచెందారు. ఈ వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు చేసి విచారించింది. కమిషన్ విజిలెన్స్ విభాగం అందజేసిన నివేదిక ఆధారంగా కేసు ముగిసినట్లు ప్రకటించారు. దీనిని వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో న్యాయవాది హెన్నీ టిబెన్ పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసును మళ్లీ మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు ఎస్ఎస్ సుందర్, ఎన్.సెంథిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో హాజరైన అడ్వొకేట్ జనరల్, ఈ ఘటనలో సంబంధాలున్న అధికారుల జాబితాను దాఖలుచేసినట్లు తెలిపారు. తుపాకి కాల్పుల ఘటనలో సంబంధాలున్న అధికారులకు పదోన్నతులు కల్పించడంపై ప్రశ్నించిన ధర్మాసనం, సంబంధిత అధికారులను ఈ కేసులో చేర్చి పిటిషన్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేశారు. న్యాయస్థానం ఉత్తర్వులతో, కమిషన్ నివేదికలో కాల్పులు జరిపిన పోలీసులు, కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఈ కేసులో చేర్చుతూ అడిషనల్ పిటిషన్‌ను హెన్రీ టిబెన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తులు ఎస్ఎస్ సుందర్, ఎన్.సెంథిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం, పిటిషన్‌లో చేర్చిన 17 మంది అధికారులు అఫిడవిట్ దాఖలుచేయాలని నోటీసులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది. ఈ నేపథ్యంలో, స్టెరిలైట్ కర్మాగారం ప్రాంగణంలో ప్రమాదకర వ్యర్థాలున్నాయని, అందువల్ల కర్మాగారం కూల్చివేయాలని కోరుతూ సంఘ శ్రేయోభిలాషి ఫాతిమా దాఖలుచేసిన పిటిషన్‌ను, ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవర్తిలతో కూడిన ప్రథమ ధర్మాసనం విచారించింది. కర్మాగారంలో పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలు తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి దాఖలుచేయాలని కాలుష్య నియంత్రణ బోర్డుకు ప్రథమ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

బాలుడికి లైంగిక వేధింపులు

యువకుడికి 20 ఏళ్ల జైలు

పెరంబూర్, ఫిబ్రవరి 1: తేనిలో బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో యువకుడిని 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. గత 2019లో కంబం ప్రాంతానికి చెందిన విజయ్, అదే ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలుడిని హత్యా చేస్తానని బెదిరించి, తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు బాలుడిని చిత్రహింసలకు గురిచేశాడు. ఆ యువకుడి నుంచి ఎలాగో తప్పించుకున్న బాలుడు ఇంటికి చేరుకొని తల్లిదండ్రులకు జరిగిన విషయం తెలిపాడు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కంబం పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విజయ్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు తేని జిల్లా పోక్సో న్యాయస్థానం విచారించింది. ఈ కేసులో న్యాయమూర్తి గణేశన్ వెలువరించిన తీర్పులో... నిందితుడు విజయ్‌కు పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలుశిక్ష విధిస్తామన్నారు. అలాగే, బాలుడిపై దాడిచేయడం, చిత్రహింసలు పాలుచేసి గాయపరచడంతో, సెక్షన్ 323 ప్రకారం ఏడాది జైలు, రూ.1,000 జరిమానా విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

తెలుగు ప్రముఖుడు బుర్రా రఘురామయ్య కన్నుమూత



(ఫైల్‌ఫొటో)

ప్యారీస్, ఫిబ్రవరి1: ప్రముఖ వ్యాపారవేత్త, తెలుగు ప్రముఖుడు బుర్రా రఘురామయ్య (79) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా బుధవారం మృతిచెందారు. ఫుడ్ ఇంగ్రీడెంట్ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ డైరెక్టర్‌గా, స్థానిక కొరట్టూరులోని శ్రీఆంధ్ర కళా స్రవంతిలో సభ్యుడిగా వ్యవహరిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపకారవేతనం, పేదలకు సహాయాలు పంపిణీ చేయడంలో బుర్రా రఘురామయ్య ముందుండేవారని పలువురు తెలుగు ప్రముఖులు తమ సంతాప ప్రకటనల్లో కొనియాడారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన కానిస్టేబుల్ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 1: స్థానిక వలసరవాక్కంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేశారు. వలసరవాక్కం పోలీస్‌స్టేషన్‌లో ఫస్ట్ గ్రేడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తంబిదురై ఆ ప్రాంతంలోని నర్సుతో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొన్నాళ్లు సహజీవనం గడిపిన తంబిదురై మోసం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా విచారణ జరిపిన మహిళా పోలీసులు, నర్సును మోసం చేసిన తంబిదురైపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి బుధవారం అరెస్ట్ చేశారు.

లింగ నిర్ధారణకు పాల్పడిన నలుగురి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 1: గర్భంలో పెరుగుతున్నది ఆడ, మగ అని నిర్ధారించే కేంద్రాన్ని చట్టవిరుద్ధంగా నడిపిన ఓ మహిళ సహా నలుగురిని అరెస్ట్ చేశారు. కళ్లకుర్చి జిల్లా త్యాగదురవం సమీపంలోని కలత్తూర్ గ్రామానికి చెంది మణివన్నన్ (34) బీఎస్సీ డిగ్రీ పూర్తిచేసి ఓ ఇంటిని అద్దెకు తీసుకొని తన భార్య పేరుతో మందుల షాపు నడుపుతున్నాడు. ఆ షాపులో గౌతమి (29) అనే నర్సు పనిచేస్తుంది. ఈ మందుల దుకాణంలో గర్భిణీలకు చట్టవిరుద్ధంగా అబార్షన్ చేస్తున్నట్లు వెప్పూర్ ప్రభుత్వాసుపత్రి అధికారులకు సమాచారం తెలిసింది. దీనిపై జారీచేసిన ఆదేశాల మేరకు వెప్పూర్ పోలీసులు సంబంధిత మందుల దుకాణానికి వెళ్లి బుధవారం తనిఖీలు నిర్వహించారు. లగ్జరీ కారులో స్కాన్ చేసి, మందుల దుకాణంలోనే పలువురికి అబార్షన్లు చేసినట్లు గుర్తించారు. లింగ నిర్ధారణకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో మణివన్నన్, గౌతమి, దినేష్, కన్నదాసన్‌లను అరెస్ట్ చేసి, స్కానింగ్ పరికరంతో కూడిన లగ్జరీ కారు, సెల్‌ఫోన్లు, అబార్షన్‌కు వినియోగించే మాత్రలు, ఇతర వైద్యపరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, ఫిబ్రవరి 1: విగ్రహాల స్మగ్లర్ దివంగత దీనదయాళన్ ఇంట్లో 36 ఏళ్లు పనిచేసిన కృష్ణకుమారి తనకు నష్టపరిహారం చెల్లించాలన్న కోరికతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఆళ్వార్‌పేటకు చెందిన దీనదయాళన్ కొన్నినెలల క్రితం మృతిచెందిన విషయం తెలిసిందే. సైదాపేటకు చెందిన కృష్ణకుమారి 36 ఏళ్లు ఆ ఇంట్లో పనిచేసింది. దీంతో దీనదయాళన్ కుమార్తె అపర్ణ బుధవారం రూ.5 లక్షల చెక్‌ను కృష్ణకుమారికి అందజేయగా, అది సరిపోదని, తనకు రూ.80 లక్షలు కావాలని లేకుంటే ఆత్మహత్యకు పాల్పడతానని బెదిరించినట్లు తెలిసింది. అపర్ణ నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కృష్ణకుమారి ఆళ్వార్‌పేటలో తన శరీరంపై కిరోసిన్ చల్లుకొని నిప్పంటించుకొనేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకొని విచారణ జరుపుతున్నారు.

కుమార్తెను చంపి తల్లి ఆత్మహత్య

ప్యారీస్, ఫిబ్రవరి 1: బుద్ధిమాంద్యం కలిగిన కుమార్తెకు ఆహారంలో విషం కలిపి హతమార్చిన తల్లి, తాను కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నగర పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానిక పులియాంతోపు పటాలం జయనగర్‌కు చెందిన గాయత్రి (35) మతిస్థిమితం లేని 14 ఏళ్ల కుమార్తె మైత్రాతో నివసిస్తున్నారు. విభేదాల కారణంగా గత 2012లో గాయత్రి తన భర్త శివకుమార్ నుంచి విడాకులు పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో, పురుషవాక్కంకు చెందిన మహమ్మద్ అబ్రాన్‌తో పదేళ్ల క్రితం గాయత్రికి ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. మహమ్మద్ అబ్రాన్ కూడా మోసం చేయడంతో విరక్తి చెందిన గాయత్రి, బుధవారం మధ్యాహ్నం తన కుమార్తెచే విషం కలిపిన ఆహారం తినిపించి, తాను కూడా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

57 సిలిండర్లు స్వాధీనం

వేలూరు, ఫిబ్రవరి 1: వేలూరు ఫ్లైయింగ్ స్క్వాడ్ తహసీల్దార్ వినాయక మూర్తి నేతృత్వంలో అనైకట్టు డివిజన్ సివిల్ సప్లై అధికారి రామలింగం, అధికారులు పళ్లికొండ, గుడియాత్తం జాతీయ రహదారుల సమీపంలోని దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వాణిజ్య సిలిండర్ బదులు గృహ సిలిండర్ వినియోగించడాన్ని గుర్తించిన అధికారులు, 57 సిలిండర్లు స్వాధీనం చేసుకొని సంబంధిత గ్యాస్ ఏజెన్సీ వద్ద అప్పగించారు.

సీపీఐ మాజీ ఎమ్మెల్యే రాజశేఖరన్ మృతి



(ఫైల్ ఫొటో)

ప్యారీస్, ఫిబ్రవరి 1: పుదుకోట జిల్లా ఆలంగుడి మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నేత ఎస్.రాజశేఖరన్ (82) అనారోగ్యంతో బుధవారం మరణించారు. ఆయన ఆలంగుడిలో సీపీఐ తరపున 2006-2011 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. అనంతరం 2013లో సీపీఎంలో చేరారు. ఆయన భార్య అమరావతి, కుమారుడు జీవభారతి, కుమార్తె కల్పన తదితరులున్నారు. రాజశేఖరన్ కన్నుమూసిన వార్త తెలిసి వివిధ రాజకీయ పార్టీల నేతలు సంతాపం తెలిపారు. గురువారం ఉదయం జరిగిన అంత్యక్రియల్లో సీపీఐ, సీపీఎం కార్యకర్తలు పాల్గొని అంజలి ఘటించారు.

10వ తేదీలోపు పాఠశాలల్లో వార్షికోత్సవాలు జరపాలి

పెరంబూర్, ఫిబ్రవరి 1: రాష్ట్రవ్యాప్తంగా అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలల్లో ఫిబ్రవరి 10వలోపు వార్షికోత్సవాలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం, వాటి నిర్వహణకు రూ.14.93 కోట్లు కేటాయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో... వేడుకల కోసం 100 మంది కంటే తక్కువ ఉన్న పాఠశాలలకు తలా రూ.2,500, 2 వేల మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.50,000 నిధులు అందజేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

కొట్టివాక్కంలో చేపల మార్కెట్


చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొట్టివాక్కంలో కొత్తగా చేపల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు కార్పొరేషన్ పెరుంగుడి జోనల్ కమిటీ అధికారి ఒకరు తెలిపారు. దక్షిణ చెన్నై పార్లమెంట్ సభ్యుడి అభివృద్ధి నిధులలో రూ.62.5 లక్షల నిధులను మంజూరు చేయించి రెండంతస్తులతో కొత్త చేపల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. మేనెలలోపు ఈ చేపలమార్కెట్ నిర్మాణం పూర్తవుతుందని కూడా చెప్పారు.



గురువారం చెన్నై నెహ్రూస్టేడియంలో క్రీడా జ్యోతిని వెలిగించి కార్పొరేషన్ పాఠశాలల విద్యార్థుల క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ







ఆలయ ధ్వజస్తంభం



ఆలయ అంతర ప్రాకారం

వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి - శివశక్తి సన్నిధి - అగ్నిలింగాన్ని కౌగిలించుకున్న పార్వతీదేవి

ఐదంతస్థులు కలిగిన రాజగోపురం

దంపతుల మధ్య అన్యోన్యతను పెంచే

పుణ్యక్షేత్రం 'తిరుశక్తిముట్రం'

ఆంధ్రజ్యోతి, చెన్నై

రాష్ట్రంలో దంపతుల మధ్య అన్యోన్యతను అధికం చేసే పుణ్యక్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. ఆ కోవలోనే కుంభకోణం సమీపంలో ఉన్న 'తిరుసత్తిపురం' (తిరుశక్తిపురం) దివ్యక్షేత్రం కూడా విడిపోయిన దంపతులను కలుపుతూ, కలతల కాపురం చేస్తున్న భార్యాభర్తల నడుమ అన్యోన్యతను పెంచుతూ, ప్రేమజంటల వివాహాలకు ఆటంకాలను తొలగించే అరుదైన ప్రాచీనక్షేత్రంగా ప్రఖ్యాతిగడించింది. సాధారణంగా ప్రతి క్షేత్రం పౌరాణిక ఘటనలను తలపించే స్థలపురాణాన్ని కలిగి ఉంటుంది. ఆ రీతిలోనే ఓ పౌరాణిక సంఘటన ఆధారంగా చేసుకుని 'తిరుసత్తి ముట్రం' (తిరుశక్తి ముట్రం) క్షేత్రం భాసిల్లుతోంది.



ఒంటికాలిపై తపస్సు చేసే భంగిమలో పార్వతిదేవి విగ్రహం. పతిదేవుడిని ఆలింగనం చేసుకుంటున్న రూపంలో శివలింగం, చిత్రలేఖనం



అప్పర్, తిరుజ్ఞానసంబంధర్ విగ్రహాలు

స్థలపురాణం....

కుంభకోణం నగరానికి చేరువగా ఉన్న ఈ క్షేత్రానికి ఆ పేరు రావటానికి కారణముంది. అగ్ని రూపంలో ఉన్న పరమేశ్వరుడిని పార్వతీ దేవి గాఢంగా ఆలింగనం చేసుకుని చుంబించిన ఘటన ఈ క్షేత్రంలో చోటుచేసుకుంది. కనుకనే ఈ క్షేత్రాన్ని తమిళంలో 'శక్తి ముత్తం' (శక్తిదేవి ఇచ్చిన ముద్దు) అని పిలిచేవారు. కాలగమనంలో ఆ పేరు కాస్త 'తరుసత్తి ముట్రం'గా మారింది. ఈ క్షేత్రంలో వెలసిన పరమశివుడిని తమిళంలో 'శివకొళుందీశర్' అని 'తళువకుయంద నాదర్' అని పిలుస్తారు. ఈ రెండు నామధేయాల వెనుక దాగిన సంఘటనలేమిటో చూద్దాం.

పతిదేవుడికి ముద్దిచ్చిన పార్వతీదేవి...

పూర్వం పార్వతీదేవికి, పరమేశ్వరుడికి మధ్య ఏదో విషయమై తీవ్ర మనస్పర్థలు ఏర్పడ్డాయి. పతిదేవుడిపై అలకను పెంచుకుని పార్వతీదేవి భూలోకానికి వెళ్ళింది. మళ్ళీ పతిదేవుని చేరేందుకు మార్గం బోధించమంటూ మునిశ్రేష్ఠుల సలహాను కోరింది. ఆ మునిపుంగవులు కావేరి నదీతీరంలో సైకత లింగాన్ని ప్రతిష్ఠించి ఆరాధించాలని సూచించారు. ఆ మేరకు పార్వతీదేవి కావేరి తీరాన ఇసుకను సేకరించి, దానితో లింగ ప్రతిష్ఠ చేయడానికి అనువైన స్థలం కోసం అన్వేషించింది.. కుంభకోణం సమీపంలో ప్రస్తుతమున్న తిరుసత్తి ముట్రం ప్రాంతాన్ని ఎంచుకుంది. ఆ చోట సైకత లింగాన్ని ప్రతిష్ఠించి నిత్యం పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించి ధ్యానం చేయసాగింది. పరమేశ్వరుడి అనుగ్రహం కోసం తపమాచరించింది. సతీదేవి తపస్సుకు సంతసించిన పతిదేవుడైన పరమేశ్వరుడు ఆ ప్రాంతానికి వేంచేసి ఆమెను ఆటపట్టించాలని అనుకున్నారు. కావేరి నదీ కట్టలు తెంచుకుని ప్రవహించేలా చేశారు. ఆకస్మికంగా కావేరి నది వరదలు రావటం చూసి పార్వతీదేవి దిగ్భ్రాంతి చెందింది. తాను ప్రతిష్ఠించిన సైకత లింగం వరదనీటిలో కొట్టుకుపోకుండా ఆ లింగాన్ని కావలించుకుని కాపాడుకోగలిగింది. ఇలాంటి పరిస్థితి మళ్ళీ రాకూడదని ఒంటి కాలిపై నిలిచి తపమాచరించింది. మళ్ళీ పరమేశ్వరుడు ఆమెను ఆటపట్టించాలనుకున్నారు. అగ్నిగోళంగా నిప్పులు చెరిగారు. ఆ మంటల వేడికి పార్వతి దేవి తపోభంగమైంది. తన ఎదుటనున్న అగ్ని గోళాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత అగ్ని రూపంలో ఉన్నది తన పతిదేవుడైన పరమేశ్వరుడేనని గ్రహించింది. క్షణం ఆలస్యం చేయకుండా ఆ అగ్ని గోళాన్ని గాఢంగా ఆలింగనం చేసుకుంది. వెంటనే అగ్ని జ్వాలలో వేడిమి తగ్గింది. చల్లటి గాలులు వీచాయి. పార్వతీ దేవి తపస్సును మెచ్చుకుని పరమేశ్వరుడు ఆమెను స్వీకరించేందుకు సిద్ధమయ్యారు. పార్వతీదేవి సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. పరమేశ్వరుడిని ఆలింగనం చేసుకుని ముద్దులాడింది. ఈ స్థలపురాణ ఘట్టాన్ని చాటిచెప్పేలా గర్భాలయ ప్రవేశద్వారం కుడివైపున శివలింగాన్ని పార్వతిదేవి ఆలింగనం చేసుకున్న భంగిమలో ఓ విగ్రహం కూడా ఉంది. ఇదే విధంగా ఒంటికాలిపై నిలిచిన పార్వతీదేవి శివలింగాన్ని ఆలింగనం చేసుకున్న రీతిలో మరో విగ్రహమూ ఉంది. పార్వతీదేవిని పరీక్షించేందుకు పరమేశ్వరుడు అగ్నిరూపం దాల్చటంతో ఇక్కడి క్షేత్రంలోని శివుడికి 'శివకొళుందీశర్' (అగ్నీశ్వరుడు) అనే పేరొచ్చింది. ఆ పేరుకు తగ్గట్లే మూలవిరాట్టుపై అక్కడక్కడా నిప్పుమంటల వల్ల ఏర్పడిన గాయపు మచ్చలు కూడా ఉన్నాయి. ఆలయ అర్చకులు దీపారాధన చేసే సమయంలో శివలింగంపై ఉన్న ఈ మచ్చలను స్పష్టంగా చూడగలం. అగ్ని రూపంలో ఉన్న తనను సాహసించి ఆలింగనం చేసుకోవడంతో సంతసించి మంటలవేడిని చల్లబరచిన ఈశ్వరుడు కనుక ఈ స్వామివారిని 'తళువకుయందైనాదర్' (ఆలింగనంతో చల్లారిన నాథుడు) అనే పేరొచ్చింది. ఈ పౌరాణిక గాథల వల్లే ఈ క్షేత్రాన్ని దర్శిస్తే దంపతుల మధ్య అన్యోన్యం పెరుగుతుందని, విడిపోయిన దంపతులు మళ్ళీ ఒక్కటవుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసంగా ఉంటోంది. అదే విధంగా ఈ స్వామివారిని మనసారా ప్రార్థిస్తే పెళ్ళీడు యువతీ యువకులకు వివాహ యోగం ప్రాప్తిస్తుందని శైవాగమ పండితులు చెబుతున్నారు.

ఆధ్యాత్మికం

ఎలా వెళ్ళాలి?

రాష్ట్రం నలుమూలల నుండి కుంభకోణం నగరానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. బస్సులో కుంభకోణం నగరానికి వెళ్ళిన తర్వాత ఆటో, టాక్సీలో పావుగంట ప్రయాణిస్తే శక్తిముత్తం క్షేత్రాన్ని చేరుకోవచ్చు.

ఆలయ విశేషాలు...

తమిళ శైవభక్త శిఖామణి అప్పర్ స్వామి ఈ క్షేత్రాన్ని దర్శించి ఆలయ జీర్ణోద్ధరణ పనులు నిర్వహించారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అప్పర్ సేవలకు పరమేశ్వరుడు సంతసించి దర్శనమిచ్చి అనుగ్రహించినట్లు చెబుతుంటారు. మరో శైవభక్తాగ్రేసరుడు తిరుజ్ఞాన సంబంధర్ ఈ క్షేత్రానికి విచ్చేసినప్పుడు ఎండవేడిమి తగులకుండా పరమేశ్వరుడు ముత్యపు పందిరిని నిర్మించాడని పురాణగాధ చెబుతోంది. ఆ సంఘటనను గుర్తు చేసేలా ప్రతియేటా తమిళమాసమైన ఆని (జూలై లేదా ఆగస్టు) నెల మొదటివారంలో ముత్యపు పందిరి ఉత్సవాలు భారీయెత్తున నిర్వహిస్తున్నారు. తిరుజ్ఞాన సంబంధర్, తిరునావుక్కరసర్ కలిసి ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడిని కీర్తిస్తూ దేవార పదిక్కం ఆలాపించారు. దేవార పదిక్కం ఆలాపించిన క్షేత్రాలలో ఈ క్షేత్రం 85వ క్షేత్రంగా పేరుగడించింది. ఈ ఆలయంలో ప్రతియేటా శివరాత్రి వేడుకలు, ఆరుద్రదర్శనం, కార్తీకదీపోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఆలయ వైభవం...

తూర్పు దిశగా రాజగోపురంతో నిర్మితమైన ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైంది. పలు సన్నిధులు ఉన్నాయి. అమ్మవారు దక్షిణాభిముఖంగా కొలువుదీరి 'పెరియనాయకి'గా భక్తులను అనుగ్రహిస్తున్నారు. స్వామివారి సన్నిధి ప్రాకారం వద్ద నిలిచిన భంగిమలో భైరవుడి విగ్రహం ప్రత్యేక సన్నిదిలో దర్శనమిస్తుంది. ఇంతటి ఎత్తైన భైరవుడి విగ్రహంలో రాష్ట్రంలో ఏ ఆలయంలోనూ లేదని శైవాగమ పండితులు చెబుతున్నారు. ఈ క్షేత్రాన్ని అగస్త్య మహర్షికూడా దర్శించారు. ఈ ఆలయంలో అపూర్వమైన ప్రాచీన శిలాశాసనాలు ఉన్నాయి. ఆలయాలలో పన్నులు వసూలు చేసే పద్ధతిని తెలిపే శాసనం ఉంది. ఈ ఆలయాన్ని ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు.

వాలీబాల్ క్రీడా నేపథ్యంలో 'ఎప్పోదుం రాజా'

విన్‌స్టార్ విజయ్ తొలిసారి అన్నా, తమ్ముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'ఎప్పోదుం రాజా'. ఆరు పాటలు, ఆరు ఫైట్ సన్నివేశాలతో పాటు కామెడీ, సెంటిమెంట్, ఎమోషన్ ఇలా అన్ని అంశాల మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించారు. విన్‌స్టార్ విజయ్‌తో పాటు జో మల్లూరి హీరోయిన్‌గా నటించగా, పి.సోమసుందరం, లయన్ కుమార్, ప్రియా, గుంతాజ్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, గోవా, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపారు. విన్‌స్టార్ విజయ్ ఇందులో హీరోగా నటించడమే కాకుండా, సొంతంగా నిర్మిస్తూ, దర్శకత్వం కూడా వహించారు. ఈ సినిమాను చూసిన సెన్సార్ సభ్యులుగా ఏకంగా 27 చోట్ల కత్తెరను ఉపయోగించినట్లు విన్‌స్టార్ విజయ్ తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారి వాలీవాల్ క్రీడా నేపథ్యంలో తెరకెక్కించామన్నారు. ఈ నెల 16వ తేదీన విడుదల చేస్తున్నట్టు చెప్పారు.



'ఎప్పోదుం రాజా'లో ఓ దృశ్యం

'డెఫ్-ఫ్రాగ్' మ్యూజిక్ లేబుల్ ఆవిష్కరణ

చిత్రపరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ప్రముఖ బడా నిర్మాత ఆర్‌బీ చౌదరి కుమారుడు, హీరో జీవా వర్ధమానం, ఇండిపెండెంట్ కళాకారులను ప్రోత్సహించేందుకు వారికి సాధికారత కల్పించేందుకు వీలుగా ఒక మ్యూజిక్ లేబుల్‌ను నెలకొల్పారు. 'డెఫ్-ఫ్రాగ్' పేరుతో స్థాపించిన ఈ మ్యూజిక్ లేబుల్ కంపెనీని హీరో జీవాతో కలిసి ప్రముఖ హీరోలు ఆర్య, కార్తీ, జయం రవి, విజయ్ ఆంటోనీ తదితర హీరోలందరూ కలిసి ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం చెన్నై నగరంలో జరిగింది. ఇందులో సినీ ప్రముఖులు, ఇండిపెండెంట్ ఆల్బమ్ మ్యూజీషియన్స్ పాల్గొన్నారు. ముఖ్యంగా హీరోలు ఆర్య, విజయ్ ఆంటోనీ, కార్తీ, జయం రవి, విష్ణు విశాల్, మిర్చి శివ, విచ్చు విశ్వనాథ్, వివేక్ ప్రసన్న, కలైయరసన్, ఆదవ్ కన్నదాసన్, జగన్, దర్శకుడు మోహన్ జి, సంగీత దర్శకులు సిద్ధార్థ్ విపిన్, సంతోష్ నారాయణన్‌తో సహా అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొని హీరో జీవాను అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. సాధారణంగా సినిమా కథలు ఆధిక్యం సాధించే చిత్రపరిశ్రమలో తమ మ్యూజికల లేబుల్ కూడా ప్రత్యేకతను కలిగి, ప్రతి కళాకారుడిని ప్రోత్సహిస్తూ వారిలోని ప్రతిభకు సానబట్టే విధంగా ఉంటుందని హీరో జీవా పేర్కొన్నారు. ఇండిపెండెంట్ కళాకారులు తయారు చేసే మ్యూజిక్ అల్బమ్స్‌కు ప్రారంభ దశ నుంచి అంతర్జాతీయ స్థాయిలో మంచి ఆదరణ, గుర్తింపు లభించేంత వరకు అండగా నిలుస్తామన్నారు. డెఫ్ ఫ్రాగ్స్ కోసం గత యేడాది కోసం సేకరించిన అనేక ఆల్బమ్స్‌ను ఇపుడు రిలీజ్ చేస్తామన్నారు. పైగా తమ సంస్థ ద్వారా అనేక మంది కొత్త ఇండిపెండెంట్ కళాకారులను సంగీత ప్రపంచానికి పరిచయం చేయడంలో గర్విస్తున్నట్టు తెలిపారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ చెప్పిన పిట్ట కథ ప్రకారం.. ఎవరేమనుకున్నప్పటికీ పట్టించుకోకుండా, మన పని మనం చేసుకుంటూ పోవడమే తమ కంపెనీ ప్రధానాంశాల్లో ఒకటన్నారు.



మ్యూజిక్ లేబుల్‌ను ఆవిష్కరిస్తున్న హీరోలు ఆర్య, విజయ్ ఆంటోనీ, జీవా

భవతారిణి చివరి చిత్రం 'పుయలిల్ ఒరు దోణి'

ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన ప్రముఖ సంగీత దర్శకురాలు, సినీ నేపథ్యగాయని, 'ఇసైజ్ఞాని' ఇళయరాజా కుమార్తె భవతారిణి సంగీతం అందించిన చివరి చిత్రం 'పుయలిల్ ఒరు దోణి'. టీజీ పిక్చర్స్ బ్యానరుపై రోమిలా నల్లయ్య నిర్మాణ సారథ్యంలో తెరకెక్కింది. విష్ణు ప్రకాష్, అర్చనా సింగ్‌లు తొలిసారి హీరోహీరోయిన్లుగా నటించారు. దర్శకుడు ఈసన్. ఈ సినిమా వివరాలను ఆయన వివరిస్తూ, 'నేను స్టోరీని ఎంచుకోకముందే నా సినిమాకు భవతారిణిని సంగీత దర్శకురాలిగా సెలెక్ట్ చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. సినిమా షూటింగ్ పూర్తి చేసిన తర్వాత ఆమెకు చూపించగా, ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సినిమాలో మొత్తం రెండు పాటలు ఉండగా, వాటిని గేయరచయిత స్నేహనన్ రచించారు. జీవీ ప్రకాష్, మానసిలు ఆలపించారు. వినసొంపుగా ఉంటాయి. అయితే, ఈ చిత్రం విడుదలకు ముందే ఆమె భౌతికంగా దూరమవుతారని కలలో కూడా ఊహించలేదు. ఆమె మా చిత్రానికి ఎంతో బలం. ఖచ్చితంగా ఈ సినిమా విజయం ఆమెకు అంకితం చేస్తాం' అని పేర్కొన్నారు.



జీవీ ప్రకాష్, భవతారిణి తదితరులు

చిత్రజ్యోతి

నా భార్య మాటలు నిజమయ్యాయి : హీరో అశోక్ సెల్వన్

'బ్లూస్టార్' విజయంతో తన భార్య చెప్పిన మాటలు నిజమయ్యాయని హీరో అశోక్ సెల్వన్ అన్నారు. సుదీర్ఘకాలంగా అనేక చిత్రాల్లో నటించినప్పటికీ ప్రేక్షకులు థియేటర్‌లో చప్పట్లు కొడుతూ ఎంజాయ్ చేసిన సందర్భాలు లేవని, కానీ ఈ చిత్రంలో ఆ కోరిక తీరిపోయిందన్నారు. జయకుమార్ దర్శకత్వంలో అశోక్ సెల్వన్, సంతాను భాగ్యరాజ్, పృథ్వి, కీర్తా పాండ్యన్, దివ్య తదితరులు నటించిన 'బ్లూస్టార్' గత వారం విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. దీంతో ఈ చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం నగరంలో సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఇందులో యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు. అశోక్ సెల్వన్ మాట్లాడుతూ, 'నీకూ ఒక సమయం వస్తుంది, అపుడు ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ సినిమాను చూస్తారంటూ' నా నిజ జీవిత ప్రియురాలు, భార్య కీర్తిపాండ్యన్ పదేపదే చెబుతుంటారని, ఆ మాటలు ఇపుడు నిజమయ్యాయి. ఏ థియేటర్‌కు వెళ్ళిన ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంతటి ఘన విజయం చేసిన ప్రేక్షకదేవుళ్ళకు మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను' అని పేర్కొన్నారు. మరో హీరో సంతాను మాట్లాడుతూ, 'నేను సినిమాలో సక్సెస్ అనే వార్త విని 5600 రోజులైంది. 'చక్కరకట్టి' చిత్రం తర్వాత విజయం కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. ఇప్పటికి అది 'బ్లూస్టార్' రూపంలో దక్కింది. "నేను అనేక మందిని వెండితెరకు పరిచయం చేశాను. కానీ, నా కుమారుడికి సరైన సక్సెస్ లేదు" అంటూ నా తండ్రి భాగ్యరాజ్ తీవ్ర మనోవేదన చెందుతూ కన్నీరు కూడా కార్చారు. ఆయన బాధను ఈ చిత్రం తొలగించింది. చిత్ర బృందానికి కూడా ఆయన కృతజ్ఞత లేఖను కూడా రాశారు. మా అమ్మ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్న వయసులో క్రికెటర్ కావాలన్నది నా కోరిక కానీ అది సాధ్యం కాలేదు. ఈ సినిమాలో క్రికెటర్‌గా నటించడం చాలా సంతోషం కలిగించింది' అని అన్నారు. నిర్మాత పా.రంజిత్, దర్శకుడు జయకుమార్, హీరోయిన్ కీర్తిపాండ్యన్ తదితరులు ప్రసంగించారు.



'బ్లూస్టార్' సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

ఐదుగురికి 'నాగిరెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కారాలు'

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఐదుగురికి 'నాగిరెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కారాలు' ప్రదానం చేశారు. స్థానిక వడపళనిలోని విజయా హెల్త్ సెంటర్ ప్రాంగణంలో వున్న 'పీటర్‌సన్ క్యాన్సర్ సెంటర్'లో ఈ పురస్కార ప్రదానోత్సవం ఇటీవల జరిగింది. పీటర్‌సన్ క్యాన్సర్ సెంటర్ సుప్రసిద్ధ సినీ నిర్మాత బి.నాగిరెడ్డి ఆశీస్సులతో 2003లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ కేంద్రం నిర్వాహకులు ప్రతి ఏడాది జీవన సాఫల్య పురస్కారాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాదికి గాను ప్రముఖ నటుడు మదన్ బాబ్, దర్శకుడు ఎస్‌బీ కాంతన్, నిర్మాత టీవీ వరదరాజన్, న్యూక్లియర్ ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మీపతి, రచయిత్రి సరళా పంచపకేశన్‌లకు ఈ పురస్కారాలను ప్రదానం చేసి, సత్కరించారు. ఈ సందర్భంగా వారికి జ్ఞాపిక, నగదు బహుమతి అందజేశారు. పీటర్‌సన్ క్యాన్సర్ కేంద్ర మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయరాఘవన్, డైరెక్టర్ డాక్టర్ ఉషా విజయరాఘవన్, డాక్టర్ కృష్ణన్ తదితరులు పురస్కార గ్రహీతలను సత్కరించారు.



పురస్కార గ్రహీతలు

సదరన్ ఇండియా వైశ్య సంఘం సేవలు ప్రశంసనీయం

సామూహిక వివాహ వేడుకల్లో వక్తలు

ప్యారీస్, ఫిబ్రవరి 1: సామాజిక బాధ్యతగా 408 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించిన సదరన్ ఇండియా వైశ్య సంఘం సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ప్యారీస్ గిడ్డంగి వీధిలో ఉన్న సదరన్ ఇండియా వైశ్య సంఘం నిర్వహణలో ఉన్న ఆర్యవైశ్య సామూహిక వివాహ సంస్థ ఆధ్వర్యంలో 44వ కార్యక్రమంగా గురువారం ఉదయం కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నాలుగు జంటలకు ఘనంగా వివాహాలు జరిపించారు. సంఘ అధ్యక్షుడు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ... దాదాపు 119 సంవత్సరాలుగా తమ సంఘం ఆధ్యాత్మిక, క్రీడ, అన్నదానం, విద్యాదానం, చరమ సంస్కారం తదితర సేవా కార్యక్రమాల్లో ముందుందని తెలిపారు. వివాహాలు చేసుకొనే స్థోమత లేక ఆర్థికంగా నలుగుతున్న యువజంటలకు సంస్థ తరఫున అమ్మవారి సమక్షంలో శాస్త్రోక్తంగా వివాహం జరిపిస్తున్నామని, వధూవరులకు మంగళసూత్రం, పట్టువస్త్రాలు, గృహ సామగ్రిని కానుకగా అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎస్‌ఏసీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.అనంత పద్మనాభన్, గౌరవ అతిథులుగా ఎస్‌కేపీడీ ట్రస్టీ ఎస్ఎల్ సుదర్శనం, పారిశ్రామికవేత్తలు పి.సంపత్‌కుమార్, టీవీ సుబ్బారావు, జీపీ అశోక్‌కుమార్‌లు హాజరై వివాహ విశిష్టత, వైశ్య సంఘం చరిత్ర గురించి వివరించారు. సంఘ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, కోశాధికారి పెసల రమేష్, వివాహ సంస్థ చైర్మెన్ సీఏ శేఖర్, కార్యదర్శి టీజీ పార్థసారథి, ఉపాధ్యక్షులు మద్దాలి కాశివిశ్వనాథం, జీపీపీ సుబ్బారావు, మన్నారు ఉదయకుమార్, తాతా నిరంజన్, సముద్రాలు మురళి, కోట గాయత్రి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అజంతా శంకరరావు అతిథులతో కలసి వధూవరులను ఆశీర్వదించడంతో పాటు దాతలకు మెమెంటోలు బహూకరించి ఘనంగా సత్కరించారు.



నూతన వధూవరులతో అజంతా శంకరరావు, అనంత పద్మనాభన్ తదితరులు



గోపుర కలశానికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న శివాచార్యులు

వైభవంగా కచ్చబేశ్వర ఆలయ కుంభాభిషేకం

ప్యారీస్, ఫిబ్రవరి 1: కాంచీపురంలో వెలసిన సుందరాంబిక సమేత కచ్చబేశ్వర ఆలయ మహాకుంభాభిషేకం గురువారం ఉదయం శుభ ముహూర్తంలో వైభవంగా జరిగింది. పెరుమాళ్, బ్రహ్మ, సూర్యుడు, భైరవుడు, వినాయకుడు తదితర దేవతామూర్తులు ఈ ప్రాంతంలో శివపరమాత్ముడిని పూజించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయ కుంభాభిషేకం 1954 జూన్ 13, 2005 జూన్ 10 తేదీల్లో రెండు సార్లు జరిగింది. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది మహాకుంభాభిషేకం నిర్వహించాలని నిర్ణయించి, రూ.3 కోట్లతో జీర్ణోద్ధరణ పనులను పూర్తిచేశారు. మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో 33 యాగగుండాలు ఏర్పాటుచేసి, వాటిలో 160 మంది శివాచార్యులు మూడురోజులు యాగపూజలు నిర్వహించారు. గురువారం ఉదయం గణపతిపూజ, గోపూజ, పవిత్ర జలాలు నింపిన కలశాల ఊరేగింపు అనంతరం వేదమంత్రోచ్చరణ, మేళతాళాల సందడి, భక్తులు శివనామస్మరణల మధ్య శివాచార్యులు రాజగోపురాలకు, మూలవిరాట్టు విమానం, పరివార దేవతల గోపురాలకు పవిత్ర జలాలతో కుంభాభిషేకం నిర్వహించారు. కాంచీపురం సర్కిల్ డీఐజీ పొన్‌మణి, ఎస్పీ షణ్ముగం నేతృత్వంలో సుమారు 300 మందికిపైగా పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్, కలెక్టర్ కలైసెల్వి మోహన్, డీఆర్వో వెంకటేశ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.